ప్రజాశక్తి
సోమవారం డిసెంబర్ 29 2025 పేజీలు 12
విజయనగరం పార్వతీపురం మన్యం

రాజాంలో బైక్ ర్యాలీ చేస్తున్న కార్మికులు

సాలూరులో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు ఎన్‌వై నాయుడు

సిఐటియు మహాసభల జయప్రదానికి బైక్ ర్యాలీలు

- విజయనగరంలో రెడ్‌మార్చ్
- మహిళల కోలాటం
- 4న బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపు

విజయనగరంలో రెడ్‌మార్చ్ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4వరకు జరగనున్న జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఆదివారం పలుచోట్ల సిఐటియు ఆధ్వర్యాన బైక్‌ర్యాలీలు నిర్వహించారు. విజయనరంలో కోట జంక్షన్ నుండి మూడు లాంతర్లు మీదుగా గంటస్తంభం వరకు రెడ్‌మార్చ్ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న మహిళా కార్మికులు, నాయకులు రెడ్‌షర్టులు, ఎర్రచీరలు ధరించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ర్యాలీని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రమణ మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జనవరి 4వరకు ఆంధ్ర రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సిఐటియు ఆలిండియా మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. మహాసభల చివరి రోజు జనవరి 4న లక్షలాది మందితో ర్యాలీ, బహిరంగ సభ జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలకు ఐదు దేశాల నుంచి కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటా రన్నారు. కార్మికులు, స్కీంవర్కర్లు హాజరై బహిరంగ సభను జయప్రదంచేయాలని కోరారు. ర్యాలీలో సిఐటియు జిల్లా నాయకులు శ్రీలక్ష్మి, ఎ.జగన్మోహన్రావు, బి.రమణ, పి.రమణమ్మ, ఎస్ అనసూయ, బి.సుధారాణి, పైడ్రాజు, అప్పలసూరి తదితరులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

సాలూరులో బైక్ ర్యాలీ

సాలూరు : విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలు విజయవంతం కావాలని ఆదివారం సాలూరు పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ బ్యాంకు జంక్షన్ వద్ద బైక్ ర్యాలీని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, పట్టణ నాయకులు టి.శంకరరావు, టి.వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీ పోస్టాఫీసు, బోసు బొమ్మ, చిన్న బజారు, ఎన్‌టిఆర్ సెంటర్, కోట సెంటర్, పెద్ద కోమటిపేట, కెహెచ్ స్కూల్ మీదుగా బోసు బొమ్మ కూడలి వరకు సాగింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ కార్యదర్శి టి.రవి, సిఐటియు నాయకులు పార్వతి, లక్ష్మి, పోలరాజు, వెంకన్న, మీడియా ఇన్‌ఛార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజాం : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రాజాం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ (మిగతా.. 3లో)

సంక్రాంతికి పప్పులు ఉడకనట్లే

పండక్కీ పంపిణీ కాని కందిపప్పు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ ఏడాది కూడా సంక్రాంతికి రాష్ట్ర ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేయడం లేదు. రేషన్ డిపోల ద్వారా నిరుపేదలకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువులతోపాటు కందిపప్పు ఈసారైనా పండగకు సరఫరా చేస్తారేమోనని ఆశించారు. అయితే ఈ పండగకు కూడా పేదల ఇళ్లల్లో కందిపప్పు ఉడికే పరిస్థితి లేదు. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు కిలో ధర 200 రూపాయలపైనే పలుకుతోంది. గత ప్రభుత్వం హయాంలో ఎలాగూ కందిపప్పు పంపిణీ చేయలేదు. టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలోనైనా పంపిణీ చేస్తారని పేదలు ఆశించారు. కానీ ఆ ఆశలు అడియాశలయ్యే విధంగా ప్రభుత్వం చేతులెత్తేసింది. కందిపప్పు భారాన్ని మోయలేక రాగులు, గోధుమ పిండి సరఫరా చేయాలని నిర్ణయించింది. మన్యం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల్లో ఒక్కో తెల్లరేషన్ కార్డుకు రెండు, మూడు కిలోలు చొప్పున రాగులు (మిగతా.. 3లో)

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు రాక

- బెల్లానపేటలో సూపర్ స్మెల్టర్ స్టీల్‌ప్లాంట్ బాధిత రైతులతో సభ
- విజయనగరంలో జిల్లా అమరవీరుల చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు గుర్ల మండలంలో సూపర్‌స్మెల్టర్స్ స్టీల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న రైతులకు మద్దతు తెలిపేందుకు బెల్లాన పేటలో ఏర్పాటు చేసిన సభలో శ్రీనివాసరావు తో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పాల్గొంటారు. నెల్లిమర్ల మూలస్టేషన్ నుంచి వల్లాపురం వెళ్లే రోడ్డులో బాధిత 5గ్రామాల నిర్వాసితులు ఈ సభలో పాల్గొననున్నారు. సాయంత్రం 5.30 గంటలకు (మిగతా.. 3లో)

లక్ష్మీపురం తూనిక కేంద్రం వద్ద నాటుబళ్లతో ఉన్న చెరుకు

లారీ రాదు.. చెరకు కదలదు

తూనిక కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం, నిడగల్లులో చెరకు తూనిక కేంద్రాల వద్ద నాటుబళ్లతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. సంకిలి ప్యారీ చక్కెర ఫ్యాక్టరీలోని ఈ తూనిక కేంద్రాలకు నాటుబళ్లు, ట్రాక్టర్లతో రైతులు చెరకు తీసుకొచ్చారు. గత వారం రోజులుగా తూనిక కేంద్రాలకు లారీలు రావడం లేదు. దీంతో చెరకు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు సంక్రాంతి పండగ దగ్గర పడుతోంది. చెరకు ఫ్యాక్టరీకి సరఫరా చేసి వచ్చిన డబ్బులతో పండక్కి కొత్త బట్టలు, సరుకులు కొనుక్కోవాలని రైతులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు చెరకు వెంటవెంటనే వెళ్లకపోవడంతో ఎండుతున్న చెరకు రికవరీ శాతం తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి చెరకును త్వరగా క్రషింగ్‌కి తరలించాలని కోరుతున్నారు.

అంబరాన్నంటిన కందికొత్తల సంబరం

ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు సాక్ష్యం ఉత్సవం : కలెక్టర్

12 లో

ప్రభుత్వ బడుల రక్షణకు ఉద్యమిద్దాం

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ బడులను రక్షించుకునేందుకు సామాజిక బాధ్యత కలిగిన ఉపాధ్యాయ సంఘంగా ప్రజలతో కలిసి ఉద్యమించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ 51వ జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సమావేశాలను ప్రారంభిస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంఘంగా రాష్ట్రంలో యుటిఎఫ్‌ది ప్రథమ స్థానం అన్నారు. 117 జీఓ రద్దు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు రద్దు చేయకుండా పాఠశాలలను 9 రకాలుగా విభజించారన్నారు. ఒత్తిడితో కూడిన విద్యా విధానం నేడు అమలు జరుగుతుందన్నారు. నేడు 19వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. రానున్న కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలను తగ్గించడమే పనిగా పాలన సాగుతుందన్నారు. తల్లికి వందనం పథకం జూన్‌లో ఇవ్వడం ద్వారా విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయేలా చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య తగ్గించే ప్రక్రియ సాల్ట్ ఒప్పందంలో భాగంగా ప్రభుత్వం చేస్తుందన్నారు. ఇలా ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రభుత్వ పాఠశాలు ఎలా బలోపేతం అవుతాయని (మిగతా.. 3లో)

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భాస్కరరావు, శ్రీనివాసరావు

శ్రీనివాసరావు, భాస్కరరావు

యుటిఎఫ్ విజయనగరం జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్ భాస్కరరావు, కె.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సందర్భంగా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా మీసాల అప్పలనాయుడు, మహిళా సహాధ్యక్షులుగా జి.పార్వతి, సహాధ్యక్షులుగా ప్రసన్నకుమార్, కోశాధికారిగా సిహెచ్ తిరుపతినాయుడు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా పక్కి వాసు, కె.ప్రసాదరావు, పి.త్రినాథ్, ఎం.కేశవరావు, అర్‌యుఎ సూర్యారావు, జివి రమణ, ఉషా, కె.శ్రీదేవి, జి.రాజారావు, ఎన్.సత్యన్నారాయణ, ఎ.శంకరరావు, ఎన్.రఘునాథరాజు, పి.మహేష్, ఎస్.వెంకటరావుతో పాటు రాష్ట్ర కౌన్సిలర్లను, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కిల్లాడ అప్పారావును ఎన్నుకున్నారు.

టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడిని కలిసిన శ్రీను

ప్రజాశక్తి - కొత్తవలస

విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షులను విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు లంక శ్రీను ఆదివారం మర్యాదపూర్వకంగా విశాఖపట్నంలో కలిశారు. కూటమి ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఎల్లవేళలా అభివృద్ధికి తోడ్పాడి అందరికీ అందుబాటులో ఉంటానని శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.అప్పారావు, ఎల్.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం చేయాలి

ప్రజాశక్తి- గంట్యాడ

పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు

రానున్న వేసవి సెలవులలో విద్యార్థులు పుస్తక పఠనం తప్పనిసరిగా చేయాలని గ్రంథాలయాధికారి కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గ్రంథాలయంలోని చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఖాళీ సమయంలో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి రామాయణం, మహాభారతం, భాగవతంతో పాటు జాతక కథలు, నీతి కథలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో పుస్తకాలను చదివించి ఆటలను ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, ఎస్‌సి వసతి గృహం విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఆటో స్టాండ్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనకల పద్మనాభం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఎగురు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశాన్ని అన్నిరంగాల్లో కాంగ్రెస్ పార్టీ కులమతాలకి అతీతంగా అభివృద్ధి బాటలో నడిపించిందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి ప్రభుత్వ రంగాలను ప్రయివేట్ పరం చేయడమే కాకుండా మత విద్వేషాలు సృష్టించి లబ్ది పొందుతుందని ఆరోపించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకల వెంకటి, కె. అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళలపై లైంగిక దాడులు అరికట్టాలని జైభీంరావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం వారు నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ నెల 17న సిఎం సొంత నియోజకవర్గం కుప్పంలో మహిళను ముగ్గురు యువకులు లైంగిక దాడి చేయడం దారుణమన్నారు. భర్తతో కలిసి పశువులు మేపడానికి వెళ్లగా మాటు వేసి యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారని తెలిపారు. దీనిపై బాధితురాలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిందని ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత మహిళకు న్యాయం చేసి ఆదుకొని మహిళలపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు.

కళ్లాల్లోనే ధాన్యం

- మందకొడిగా ధాన్యం సేకరణ
- నూర్పులకు ముందుకు రాని రైతులు
- పొలాల్లోనే కుప్పలు

పంట పండించే వరకు ఒక బాధ అని, పండించిన పంటను అమ్ముకోవడానికి మరో బాధ పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీడపీడల నుంచి పంటలను కాపాడుకుంటూ, వరుస తుపాన్లను సైతం తట్టుకుని ఎంతో కష్టపడి పంట పండిస్తే, చివరకు దాన్యాన్ని అమ్ముకునే దశలో నానా తిప్పలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. కోతలు పూర్తయిన తర్వాత ధాన్యాన్ని నూర్పు చేసి బస్తాల్లో నింపి కల్లాల్లోనే నెట్టుకట్టి ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో కొంతమంది రైతులు కోసిన చేలను దిబ్బలు వేసి నూర్పు చేసేందుకు కూడా ఆలోచిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది.

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ఈ ఏడాది సుమారు 98 శాతం రైతులు వరి పంటలను కోత కోసం కల్లాలకు తరలించారు. ఇందులో కొంత మంది వరి నూర్పులు వేసి ధాన్యాన్ని అమ్మేందుకు సిద్ధ పడ్డారు. అయితే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని కల్లాల్లోనే బస్తాలుగా మార్చి నెట్లు వేసి ఉంచారు. ఇటువంటి సమయంలో వర్షాలు పడితే ధాన్యం మొత్తం తడిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నూర్పు వేసి ధాన్యాన్ని సిబ్బంది, అధికారులు సకాలంలో కొనకపోవడంతో మరి కొంత మంది రైతులు వరి నూర్పులు వేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో చాలా ఎకరాల్లో వరి పంట కుప్పలుగానే పొలాల్లో దర్శనమిస్తున్నాయి.

వెంటాడుతున్న జిపిఎస్ సమస్య

నూర్పు వేసి ధాన్యం అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాలకు వెళ్లితే జిపిఎస్ అవ్వడం లేదని చెపుతూ ట్రక్ షీట్లు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించే అవకాశం లేక, కల్లాల్లోనే నిల్వ చేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. అక్కడే ధాన్యాన్ని ఉంచి రాత్రింబవళ్ళు కాపలా కాయాల్సి వస్తుండటంతో తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నామని చెబుతున్నారు.

వర్షాలు పడితే అంతే సంగతి

వర్షాలు పడితే ధాన్యం తడిసి నాణ్యత తగ్గే ప్రమాదం ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యాన్ని సేకరించకపోతే తమకు తీవ్ర నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయలేని ఈ ప్రభుత్వాలు ఎందుకని మండల రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ట్రక్ షీట్లు జారీ చేయాలని, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రక్‌షీట్ ఇవ్వడం లేదు

నూర్పు చేసి సుమారు ఇరవై రోజులు కావస్తుంది. రైతు సేవా కేంద్రాలకు వెళ్తే ట్రక్ షీట్ ఇవ్వడం లేదు. చేసేది ఏమి లేకా బస్తాలను నెట్టు వేసి కాపాలా కాస్తున్నాం.

- బోణి అప్పలనాయుడు రైతు, లింగాలవలస.

అప్పులు చేసి పండించాం

పొలాల్లోనే ఉన్న వరి కుప్పలు

ఈఏడాది వరి పంట బాగా పండి చేతికొచ్చిందని ఆనందం కన్నా ఆ పంటను సకాలంలో అమ్ముకోలేకపోతున్నామన్న బాధ మమ్మల్ని వేధిస్తుంది. అప్పులు చేసి వరి పంట పండించి అతి కష్టం మీద కల్లాలకు తరలించాం. ఇప్పుడు నూర్పులు వేసి ధాన్యం బస్తాలను సిద్ధం చేసి అమ్మేందుకు ముందుకొస్తే ధాన్యం సేకరణ అంతంత మాత్రంగానే ఉంది. దీంతో బస్తాలు కల్లాల్లోనే మూలుగుతున్నాయి. అధికారులు స్పందించి ధాన్యం సేకరణ చేపట్టాలి.

- కననకల బంగారమ్మ, రైతు, లింగాలవలస.

కళ్లాల్లోనే దర్శనమిస్తున్న ధాన్యం బస్తాలు

పంట అమ్మకానికి పాట్లు

వేపాడ: మండలంలో రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించడానికి నానా తిప్పలు పడుతున్నారు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు సక్రమంగా ఇవ్వకపోవడం ఒక కారణమైతే, ఆర్‌ఎస్‌కె కేంద్రాల్లో ట్రక్‌షీట్లు జనరేట్ సకాలంలో కాకపోవడం మరో కారణంగా తెలిస్తోంది. కారణం ఏదైనా రైతుల పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం బస్తాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటి వరకూ మండలంలో కేవలం 40 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు గణాం కాలు చెబుతున్నాయి. ధాన్యం కొనుగోలుకు అధికారులు ముందుకు రాకపోవడంతో చాలా మంది రైతులు వరి పంటను పొలాల్లోనే కుప్పలుగా ఉంచుతున్నారు.

పంట పొలాల్లోనే ధాన్యం

మా గ్రామానికి చెందిన చాలా మంది రైతులు నా కంటే ముందు వరి నూర్పుడులు వేశారు. ఆర్‌ఎస్‌కెకు వెళ్లి అమ్మేందుకు ప్రయత్నించారు. ట్రక్‌షీట్లు రాక పోవడంతో అధికారులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. దీంతో నేను భయపడి ఇంకా పంటను పొలంలోనే దిబ్బలు రూపంలో ఉంచాను.

నిరుజోగి ఎరినాయుడు, రైతు సింగరాయి.

బ్యాంకు గ్యారంటీలు పెంచాలి

ధాన్యం కొనుగోలు చేసేందుకు సంబంధించి బ్యాంకు గ్యారంటీలు పెంచినట్లయితే కేంద్రాల ద్వారా త్వరితిగతిన రైతులు నుంచి ధాన్యం కొనుగోలుకు సాధ్యమవుతోంది. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం.

ఎం. స్వాతీకుమారి, ఎఒ, వేపాడ.

సాగు కాలువ కప్పివేతపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పూసపాటి పాలెం గ్రామం వద్ద సాగు కాలువను కప్పి లేఔట్ కోసం రహదారి నిర్మించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిధిలోని కొప్పెర్ల జాతీయ రహదారి సమీపంలో లేఔట్ నిర్వాహకులు సాగు నీటి కాలువను కప్పి సిమెంట్ పైపులు అమర్చిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న పూసపాటి పాలెం గ్రామ రైతులు ఆదివారం పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కాలువ ద్వారా సుమారు 600 ఎకరాల ఆయకట్టు సాగునీరు పొందుతోందని రైతులు తెలిపారు. కుమిలి ఛానల్ ద్వారా వచ్చే ఈ నీటిపైనే తమ వ్యవసాయం పూర్తిగా ఆధారపడి ఉందని అన్నారు. సాగు నీటి కాలువను ఎటువంటి అనుమతులూ లేకుండా కప్పివేయడం పూర్తిగా అన్యాయమని రైతులు మండిపడ్డారు. ఈ కాలువ కప్పివేత వల్ల వర్షాకాలంలో గ్రామానికి తీవ్ర వరద ముప్పు ఏర్పడుతుందని, నీరు వెళ్లే దారి మూసుకుపోతే పూసపాటిపాలెం గ్రామం మొత్తం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములకు నీరు అందించే కీలకమైన కాలువను లేఔట్ అవసరాల కోసం కప్పివేయడం రైతుల జీవనాధారాలపై దెబ్బకొట్టడమేనని అన్నారు. ఇలాంటి చర్యలు సహించబోమని, వెంటనే సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఈ విషయాన్ని తెలియజేస్తామని రైతులు స్పష్టం చేశారు. అధికారులు వెంటనే స్పందించి కాలువను పునరుద్ధరించాలని, లేఔట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పూసపాటి పాలెం సర్పంచ్ రౌత్ స్వామినాయుడు, కొప్పర్ల ఛానల్ డైరెక్టర్ రౌతు సత్యం, మాజీ సర్పంచ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతులు

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో జాకేరు నుంచి కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట, వల్లంపూడి, వేపాడ మీదుగా ఎపి ఆదర్శ పాఠశాలకు బడి బస్సు వెళ్లే రోడ్డు గుంతల పడడంతో వాటి మరమ్మతు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ రోడ్డులో విద్యార్థులు వెళ్లే బడి బస్సుకు ఇబ్బందిగా మారిందని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పవన్ కళ్యాణ్‌కు వినతి పత్రం సమర్పించారు. దీంతో బడి బస్సు రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా రోడ్డుకు పడిన గుంతలను పూడ్చివేయడానికి నిధులు మంజూరు కావడంతో ఆర్అండ్‌బి ఎఇ స్వామినాయుడు పనులను పర్యవేక్షించారు.

సతివాడలో క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సంక్రాంతి సందర్భంగా మండలంలోని సతివాడ గ్రామంలో ఆదివారం ప్రీమియర్ లీగ్-5 క్రికెట్ పోటీలను ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ, గ్రామ పెద్ద కోరాడ శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా సంక్రాతిని పురస్కరించుకొని గ్రామస్థులు, యువత క్రికెట్ పోటీలు నిర్వహించడం అనవాయితీగా వస్తుందని ఈ ఏడాది కూడా ప్రీమియర్ లీగ్ - 5 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మండల స్థాయిలో పోటీలు నిర్వహించి సంక్రాతి రోజున విజేత జట్లకు ప్రథమ, ద్వీతీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చింతపల్లి శ్రీనివాసరావు, ఆల్తి నల్లిబాబు, మీసాల చిన్న, చందక నర్సింహులు, యువత పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

సిఐటియు మహాసభల జయప్రదానికి బైక్ ర్యాలీలు

శృంగవరపుకోట.. ఆటో ప్రచారం చేస్తున్న నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో సిఐటియు నాయకులు ఎం.త్రినాథ్, కె.అసిరప్పడు, ఎల్‌విఎస్ నారాయణ, కంచినాయుడు, జి.శ్రీనివాసరావు, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదానికి ఆటో ప్రచారం

శృంగవరపుకోట : సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని ఆటో ప్రచార కార్యక్రమాన్ని పట్టణంలోని దేవి కూడలిలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆదివారం ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంతో పాటుపలు గ్రామాల్లో సిఐటియు మహాసభలకు తరలిరావాలంటూ మైక్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చల్లా జగన్, చెలికాని ముత్యాలు, నీలిమ, ఎం.నాని, పి.సత్తమ్మ, వై.అప్పలకొండ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మొండెంఖల్‌లో ర్యాలీ

కురుపాం : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మండలంలో మొండెంఖల్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, గిరిజన సంఘం నాయకులు మండంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో జనవరి నాలుగో తేదిన జరిగే బహిరంగ సభకు కార్మికులు, ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు భారతి, బిడ్డిక సత్యవతి, బిడ్డిక సావిత్రి, బిడ్డిక కమల, పార్వతి, సాయి లక్ష్మి, కమల, కళావతి, తులసి, దమయంతి, చామంతి, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో సిఐటియు ప్రచార ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం : సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్

గుమ్మలక్ష్మీపురంలో నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కురుపాం.. మొండెంఖల్‌లో ర్యాలీ చేపడుతున్న మన్మథరావు, తదితరులు

జిల్లా కార్యదర్శి బివి రమణ ఆధ్వర్యాన ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండంగి సన్యాసిరావు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బిడ్డిక సుశీల, టి.మాలతి, నాయకులు ఆరిక మంగ, తోయక లక్ష్మి, నాగమణి, మూటక జానకి, మంగ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు కోరారు. పాలకొండలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గేదెల సత్యం, ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని బొడ్డవలస సమీపంలో జాతీయ రహదారి వద్ద లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బొడ్డ వలస గ్రామానికి చెందిన అట్టాడ పైడి నాయుడు (59) గ్రామంలో నుంచి జాతీయ రహదారికి వెళ్లి తిరిగి తన ఇంటికి చేరుకోవడానికి నడుచుకుంటూ వెళుతుండగా విశాఖపట్నం నుంచి విజయనగరం వస్తున్న లారీ ముందు నుంచి బలంగా ఢీకొంది. దీంతో పైడినాయుడు తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుని మనవడు అట్టాడ సత్తిబాబు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన పైడినాయుడు

గాయపడిన ఆటో డ్రైవర్‌కు ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

లారీ, ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండలంలోని కోమటిపల్లి జంక్షన్ జాతీయ రహదారిపై ఆటోనీ అదే మార్గంలో వెనక నుంచి వచ్చిన ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. కొత్త రేగ నుంచి గొబ్యాం వెళ్తుండగా ఆదివారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆటోలో ప్రయాణిస్తున్న చొక్కాపు అప్పలనాయుడు, అల్లు గౌరమ్మకు స్వల్ప గాయాలు కాగా ఆటో డ్రైవర్ మామిడి నాగరాజుకు తీవ్ర గాయాలు తగలడంతో వెంటనే 108కి ఫోన్ చేసి గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆటో డ్రైవర్‌ని మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెదమాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

సంక్రాంతికి పప్పులు ఉడకనట్లే

పంపిణీ చేయనున్నారు. కార్డుదారునికి పంపిణీ చేసే బియ్యంలో కోత విధించి రాగులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో గోధుమ పిండి పంపిణీ చేయనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 2 లక్షలపైనే తెలుపు రేషన్ కార్డులు ఉన్నాయి. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కుటుంబాలకు కనీసం సంక్రాంతి పండగకైనా కందిపప్పు పంపిణీ చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. పేద కుటుంబాలకు కొంతమేరకు ఆర్థిక భారం తగ్గుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సంక్రాంతి కానుకలేవీ?

2014-19 మధ్య కాలంలో టిడిపి ప్రభుత్వ హయాంలో సంక్రాంతి పండగకు చంద్రన్న కానుక కింద పిండి వంటలు చేసుకోవడానికి అవసరమైన సరుకులు పంపిణీ చేశారు. అయితే ఈసారి గత సంప్రదాయానికి భిన్నంగా టిడిపి కూటమి ప్రభుత్వం సంక్రాంతి పండగకు పేదలకు ఎలాంటి కానుకలూ ఇచ్చే అవకాశం లేదు. గతంలో కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, గోధుమపిండి, కిలో బెల్లంతోపాటు బియ్యం, చక్కెర పంపిణీ జరిగాయి. అయితే ఈసారి ప్రభుత్వం బియ్యం, రాగులు, చక్కెర మాత్రమే పేదలకు పంపిణీ చేయాలని నిర్ణయించింది.

ప్రభుత్వ బడుల రక్షణకు ఉద్యమిద్దాం

ప్రశ్నించారు. ఎన్ఇపి ద్వారా విద్యా విధానంలో వస్తున్న మార్పులు కారణంగా విద్యావిధానం పెద్దలకు, కార్పొరేట్ శక్తులకే ఉపయోగపడుతుందని అన్నారు. అధికారంలో ఎవరున్నా ప్రజా సమస్యలు, ఉద్యోగుల సమస్యలపై యుటిఎఫ్ పోరాడుతుందన్నారు. బడిని రక్షించుకునేందుకు విద్యారంగ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి ప్రజలతో కలిపి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి, డి.రాము మాట్లాడుతూ విద్యారంగ పరిస్థితిపై ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ విధానాలు అమలు వలన పాఠశాలల కుదింపు, క్లస్టర్ విధానం, సాల్ట్ ఒప్పందాలు వలన ప్రభుత్వ విద్యారంగానికి జరుగుతున్న నష్టం, ఏడాది కి ఏడాదికి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సంఖ్య తగ్గిపోవడానికి కారణాలు తెలియజేసి ప్రభుత్వ బడులను రక్షించుకోవడం కోసం ఉద్యమించాలని కోరారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు రమేష్ చంద్ర పట్నాయక్, ఎం.అప్పలనాయుడు, సత్య శ్రీనివాస్, పార్వతీ, కస్తూరి, ప్రసన్నకుమార్, చింతా భాస్కరరావు, యుటిఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత కౌన్సిల్ సమావేశం ప్రారంభం సూచికగా సీనియర్ నాయకులు సత్య శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు.

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు రాక

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రచయిత రెడ్డిశంకరరావు రాసిన విజయనగరం జిల్లా అమరవీరుల చరిత్ర పుస్తకాన్ని శ్రీనివాసరావు ఆవిష్కరిస్తారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) జిల్లా కార్యదర్శి బెహరా శంకరరావు, సిపిఐఎంఎల్ నాయకులు డి.వర్మ పాల్గొననున్నారు.

జెండా వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్‌పార్టీ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. డిసిసి కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటాలను ప్రదర్శిస్తూ, జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అద్యక్షులు మరిపి విద్యాసాగర్ మాట్లాడుతూ 1885 డిసెంబర్ 28న అఖిల భారత కాంగ్రెస్ పార్టీని బొంబాయిలో స్థాపించారని తెలిపారు. దేశ స్వతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని అన్నారు. దేశ ప్రజల గుండెల్లో కాంగ్రెస్ చిరస్థాయిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కరీమ్, బంగారు నాయుడు, షరీఫ్, చంద్ర శేఖర్ రెహమాన్, మురళి, అనిల్, ప్రసాద్, బివి రమణ, అచిబాబు, సూరిబాబులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
EP 5/2020 OS 168/2016

Between:
Pullabhatla Nagamani .....Decree holder
And :
Vobbilisetti Rajasekhar....Judgement Debtor

NOTICE
Order 21 Rule 54(1A)

To
Vobbilisetti Rajasekhar S/o Satyanarayana, Principal and owner Sri Sairam Public School R/o at D.No 18-6-6, Vakkalanka Vari Veedhi Vizianagaram.

The Decree holder filed the above E.P. for recovery of the decree amount by sell the EP Schedule mentioned property of you (JDr) and the above EP posted to **5-1-2026 at 10:30 AM** before the above Honourable court either personally or through an Advocate duly authorized by you and file your objections, if you fail to do so on **5-1-2026** the above EP will be decided in your absence for next step ordered basing on the material available on record.

By Order
P. Dhananjaya Rao
Y. Harikrishna
Advocate for DHr
Vizianagaram, Cell: 9440711430

IN THE HONOURABLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE, VIZIANAGARAM
O.S. 419/2022

Between:
Shaik Shah Jahan ....Plaintiff.
And:
Haleema Begum w/o Tenneti Srinu (Rehman), aged about 32 years, resident of D.No. 24-3/1/2, Sunkara veedhi, Vizianagaram Town & District. ....Defendant.

NOTICE

Please take notice that the plaintiff filed the above suit for recovery of money and the above matter stand posted on dt. 29-12-2025 for your appearance. Hence you are required to attend on **dt. 29-12-2025 by 10:30 am** personally or through Advocate. As otherwise matter will be decided as per procedure.

Shaik Rahim, M.A., M.L.
ADVOCATE,
VIZIANAGARAM
Ph. 9440540386.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
S.O.P. 13/2025

Between:
Tangeti (Imandi) Lepakshi Santoshi Kumari ....Petitioner
A N D:
Vizianagaram Municipal Corporation represented by its Municipal Commissioner, Vizianagaram. ....Respondent

PUBLIC NOTICE

The general public hereby informed that one Tangeti (Imandi) Lepakshi Santoshi Kumari, wife of Trimurthulu, Resident of D. No. 15-671/1, Sector IV, Shiva Shankar Nagar, Arilova Colony, GVMC (Part), Visakhapatnam (Urban), Visakhapatnam, has filed a Succession petition in SOP. 13/2025 on the file of the Honourable Principal Senior Civil Judge, Vizianagaram, seeking the Honourable Court to issue succession certificate in her favour succeeding the estate of the deceased Imandi Suribabu.If any persons are having any objections with regard to issuance of the succession certificate in her favour with regard to the estate of Imandi Suribabu they must appear in person or through counsel before the Honourable Principal Senior Civil Judge, Vizianagaram by **10:30 A.M on 20.01.2026** and put up their submissions and if any such claims were not received the Honourable Court will pass orders as per the facts and circumstances of the case.

CH. PRAVEEN RAJU,
Advocate for Petitioner,
Vizianagaram,
Ph: 9966896047

చేతులెత్తేసిన ఆర్అండ్బి

- మజ్జి రాముడిపేట, ఉంగరాడమెట్ట సిసి రోడ్డుకు మోక్షం లేనట్టే
- ప్రధాన రహదారి గుంతలమయంతో ఇబ్బందులు
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించినా స్పందన కరువు
- కాంట్రాక్టర్కు బిల్లులు రాక నిలిచిన పనులు

ప్రజాశక్తి- రేగిడి

రాజాం - పాలకొండ ఆర్అండ్బి ప్రధాన రహదారి మజ్జి రాముడు పేట, ఉంగరాడ మెట్ట గ్రామాల వద్ద పూర్తిస్థాయిలో గుంతలమయం అయింది. దీంతో అక్కడ సిమెంట్ రోడ్డు వేస్తామని గతంలో హామీలిచ్చారు. రెండేళ్లు గడిచినా ఇంతవరకు వేయకపోవడంతో పాదాచారులు, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2023 నవంబర్లో ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.8.82 కోట్లతో కాకినాడ భవానీ కనస్ట్రక్షన్స్ అనే సంస్థ పనులు చేయడానికి టెండర్లు దక్కించుకుంది. చేసిన తారు రోడ్డు పనులకు రూ.4 కోట్లు బిల్లులు చెల్లించాలని ఆర్అండ్బి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. నేటి వరకు గుత్తేదారునికి బిల్లులు చెల్లించలేదు. ఒప్పందం ప్రకారం ఇదే రోడ్డులో మజ్జి రాముడిపేట వద్ద ప్రధాన రహదారికి 150 మీటర్లు సీసీ రోడ్డు, ఉంగరాడ మెట్ట వద్ద 395 మీటర్లు సిసి రోడ్డు, రాజాం జిఎంఆర్ ఐటి నుంచి 355 మీటర్లు సిసి రోడ్డు పనులు చేయాల్సి ఉంది. వీటికి సంబంధించి రూ.2.25కోట్లతో పనులు చేయాల్సి ఉంది. అయితే ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడంతో రెండేళ్ల నుంచి గుంతల రోడ్లోనే ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింది. వాస్తవంగా 2025 అక్టోబర్ వరకు ప్రధాన రహదారి నిర్మాణానికి కాంట్రాక్టర్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. చేసిన రోడ్డు పనులకు ప్రభుత్వం బిల్లులు తేలిస్తే గాని మిగిలిన పనులు చేసేది లేదని ఆర్అండ్బి అధికారులకు ఖరాఖండీగా చెప్పడంతో ఈ మూడు చోట్ల సిసి రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. మూడు మాసాలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో అప్పాపురం సర్పంచ్ కరణం నిర్మల, ఎంపిపి ధార అప్పలనరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెనాయుడు, వావిలపల్లి జగన్మోహన్రావు ఆర్అండ్బి అధికారులను నిలదీసినా ఫలితం లేదని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు..

ఉంగరాడ మెట్ట వద్ద ప్రధాన రహదారి ఇలా..

పిజిఆర్ఎస్లో ఫిర్యాదు

మజ్జి రాముడిపేట, ఉంగరాడమెట్ట, రాజాం జిఎంఆర్ ఐటి ప్రాంతాల్లో సిసి రోడ్ నిర్మాణానికి 900 మీటర్లుకు రూ.2.25 కోట్లతో పనులు చేపట్టాలి. రెండేళ్లుగా వేయకపోవడంతో మజ్జి రాముడిపేట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కరణం శ్రీనివాసరావు పిజిఆర్ఎస్కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా అధికారులు కాంట్రాక్టర్కు రూ.4కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నందున పనులు చేయలేదని ఫిర్యాదారులకి పత్రంలో వివరణ ఇచ్చారు.

మజ్జి రాముడు పేట వద్ద రాజాం - పాలకొండ ప్రధాన రహదారి ఇలా..

పనులు చేయకపోతే మంత్రికి ఫిర్యాదు

మజ్జిరాముడు పేట, ఉంగరాడమెట్ట, రాజాం జిఎంఆర్ఐటి ప్రాంతాల్లో 900 మీటర్లు సిసి రోడ్డు నిర్మించకుంటే ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చొరవతో రోడ్లు భవనాల శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తాం. జూలైలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ కరణం నిర్మల ప్రధాన రహదారి సిసి రోడ్ నిర్మాణాలపై ప్రస్తావించినప్పటికీ ఆర్ అండ్ బి అధికారి జి.నాగభూషణరావు తాత్కాలిక పనులు చేపడతామని చెప్పారే తప్ప ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుంటే గ్రామస్తులతో కలిసి ధర్నా చేపడతాం.

- కరణం శ్రీనివాసరావు, మజ్జి రాముడిపేట

మహా ప్రస్థానం వాహనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారిని స్వస్థలాలకు తరలించేందుకు మహా ప్రస్థానం వాహనాలను ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల భద్రగిరి ఆసుపత్రి నుంచి మహిళ మృతదేహాన్ని తోపుడు బండిపై తరలించడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

పిఆర్టియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-వీరఘట్టం

పిఆర్టియు మండల నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం తూడి గ్రామ సమీపంలో పిఆర్టియు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల అధ్యక్షులుగా బి.అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.విజయభాస్కర్, అసోసియేటివ్ అధ్యక్షులు ఎ.శ్రీహరి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా నాయకులు అమనాన సూర్యనారాయణ, కాగాన విజయకుమార్, వాలేటి తవిటి నాయుడు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాడంగిలో వరుస అగ్నిప్రమాదాలు

ప్రజాశక్తి-బాడంగి

బాడంగిలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదంలో వరిగడ్డి కుప్ప కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జరిగి 24 గంటలు కూడా కాకముందే ఆదివారం మధ్యాహ్నం మరో ప్రమాదం చోటుచేసుకుంది. తెర్లి అప్పలస్వామికి చెందిన గడ్డికుప్ప అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని పాల్తేరు గ్రామ శివారులో ఆదివారం గొర్రెపోతు పందేలపై పోలీసులు దాడి చేశారు. పాల్తేరు శివారులో గొర్రెపోతు పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేపట్టారు. ఏడుగురిని అరెస్టు చేశారు. రెండు గొర్రె పోతులను, రూ.23,160 నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు చెప్పారు. సంక్రాంతి సందర్భంగా గొర్రె, కోడి పందేలు నిర్వహించినా, పేకాట ఆడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యాను ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బొబ్బిలి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలి వెంకటరమణ ద్విచక్ర వాహనంపై పాత బొబ్బిలి నుంచి సీతానగరం వైపు వస్తున్నాడు. పైప్ లైన్ దాటిన తర్వాత వెనుక నుండి వస్తున్న కోళ్ల వ్యాను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణకు గాయాలయ్యాయి. దీంతో 104 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై తన బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న రచయిత గంటేడ గౌరునాయుడు

గంటేడకు సిఐటియు శ్రమ పురస్కారం

ప్రజాశక్తి - కురుపాం

స్నేహ కళా సాహితి వ్యవస్థాపకులు, ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడుకు సిఐటియు శ్రమ పురస్కారం అందజేసింది. విశాఖపట్నంలో జరిగిన శ్రామిక ఉత్సవ్లో ఆయనకు సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పురస్కారం అందజేసి, సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమస్యలు, మన్యంలో అడవి బిడ్డల బాధలపై గంటేడ చేసిన రచనలను కొనియాడారు. ఈ సందర్భంగా కురుపాం స్నేహకళా సాహితి సభ్యులు, స్థానిక గ్రామ నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు చర్యలు

- పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు
- ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం. మురళీమోహన్ తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన చేసేందుకు ఎపిఐఐసి కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఇండస్ట్రియల్ పార్కులు, గ్రోత్ సెంటర్స్, పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో కృషి చేస్తుందన్నారు. ఎపిఐఐసి ఆధ్వర్యంలో వందల ఎకరాల్లో జూ పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. వీటితోనే కాకుండా వీటి అనుబంధ రంగాలపైన జోన్ పరిధిలో అనేక కుటుంబాలు ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నాయని తెలిపారు. జోన్ పరిధిలో ప్రస్తుతం 145 పరిశ్రమల ఉండగా, పనుల దశలో ఉన్నవి 14, ఇంకా ప్రారంభించవలసినవి 115 ఉన్నాయని తెలిపారు. మరో 187 పరిశ్రమలు సిక్లో ఉన్నాయని తెలిపారు.

జిల్లాలో కొత్తగా 4 ఎం ఎస్ ఎంఇ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తవలస మండలంలో బలిఘట్టం దగ్గర, బొండపల్లి మండలం కొండ కిండాం, రామభద్రపురం మండలం కొట్టక్కి, నెల్లిమర్ల మండలం నెల్లిమర్లలో ఎఫ్ ఎఫ్ సి లకు అనుగుణంగా ఏర్పాటు పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా త్వరితగతిన అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరైతే పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తారో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పాలకొండ పరిధిలో పనుకువలసలో 27 ఎకరాలు స్థల పరిశీలన చేశామన్నారు. కురుపాం నియోజకవర్గంలో చిలకాం, గరుగుబిల్లి మండలాల్లో ఇంకా చూస్తున్నామన్నారు, సాలూరులో ఇంకా స్థల పరిశీలన చేయాలన్నారు, పార్వతీపురంలో ఇప్పటికే స్థల పరిశీలన చేసామని, ఇది గత ప్రభుత్వంలో జగనన్న కాలనీకి ఇచ్చే స్థలం ఎఫ్ఎఫ్సి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్లో ఐదు ఎకరాలను కేటాయించారని తెలిపారు. ఇక్కడ ఎవరూ ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు రాకపోవడంతో ఆ స్థలాన్ని పరిశీలించామని తెలిపారు.

'పలు అంశాల్లో ప్రాచీన భారతం ముందంజ'

ప్రజాశక్తి-విజయనగరం

శాస్త్రం, సాంకేతికత, ఇంజినీరింగ్, గణితం, ఖగోళశాస్త్రం, వైద్యం, లోహశాస్త్రం, పరిపాలన శాస్త్రాల్లో ప్రాచీన భారతం శతాబ్దాల ముందంజలో ఉందని ప్రముఖ జాతీయవాది, రచయిత మదన్ గుప్తా అన్నారు. సత్య ఇంజినీరింగ్ కళాశాలలో 'అపూర్వ భారత్-సనాతన భారతీయ సంప్రదాయంలోని శాశ్వత సాంకేతిక వారసత్వం' ఆయన ప్రసంగించారు. ఆయన రచించిన అపూర్వ భారత్ గ్రంథంలోని అంశాలను ఉదహరిస్తూ, ప్రాచీన భారతీయ గ్రంథాలలో దాగి ఉన్న సాంకేతిక రహస్యాలను వివరించారు. కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక భావనాలు ప్రాచీన భారతీయ గ్రంథాల్లో మౌలిక స్థాయిలో ప్రతిఫలించాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, మాట్లాడుతూ ప్రాచీన భారత విజ్ఞానాన్ని పునరుద్ధరించేందుకు ఈ గ్రంథం విద్యార్థులు, పరిశోధకులు, సాధారణ పాఠకులకు అమూల్యమైనదని అన్నారు. కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్ దుర్గ బాలాజీ, ఎన్. వెంకుగోపాలరావు, సెంచూరియన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ సివికె. చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మదన్గుప్తాను సన్మానిస్తున్న సీతం డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు

ప్రజాశక్తి
సోమవారం 29 డిసెంబర్ 2025



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విఎంఆర్‌డి కమిషనర్ తేజభరత్

పుస్తక ప్రదర్శనకు పోటెత్తిన పాఠకులు

అందుబాటులో అనేక రకాల పుస్తకాలు
విశాఖ పుస్తక మహోత్సవంపై పలువురు హర్షం

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్

శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విద్య, సాహిత్యం, పోటీ పరీక్షలు, పిల్లల పుస్తకాలతో అన్ని రంగాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పుస్తక ప్రదర్శన తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు పాఠకులు అభిప్రాయపడ్డారు. పుస్తకాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రదర్శనను సందర్శించిన పాఠకులు పుస్తక ప్రదర్శనపై తమ అనుభవాలను వెల్లడించారు.

ఒకే చోట అన్ని పుస్తకాలు

విద్యార్థులకు అవసరమైన రిఫరెన్స్ పుస్తకాలు ఒకేచోట లభించడం చాలా సంతోషంగా ఉంది. చిన్న వారి నుంచి పెద్దల వరకు అన్ని వర్గాల వారిని ఆకట్టుకొనే పుస్తకాలు ఉన్నాయి.

పాయల మురళీకృష్ణ,
యువ కవి,
ఉపాధ్యాయులు

పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి

పౌరాణిక, వైజ్ఞానిక, చారిత్రక అంశాలతో కూడిన పుస్తకాలన్నీ ఈ పుస్తక ప్రదర్శనలో ఉంచారు. సాహిత్య పుస్తకాల కలెక్షన్ చాలా బాగుంది. కొత్త రచయితల పుస్తకాలు కూడా ఉన్నాయి. చాలా సంతోషంగా ఉంది.

ఆళ్ల అప్పారావు,
రిటైర్డ్ లెక్చరర్.

మంచి కార్యక్రమం

పుస్తకాలు కరువైపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి ప్రదర్శన చాలా మంచిది. అన్ని రకాల పుస్తకాలు ఒకే చోట కొలువుదీరాయి అంటే ఆనందమే కదా. వ్యక్తిత్వ వికాస పుస్తకాలు యువతకు మార్గదర్శకంగా ఉంటాయి. అనేక రచయితల గ్రంథాలు స్ఫూర్తిగా నిలుస్తాయి.

పడాల కవిస్వరరావు,
రిటైర్డ్ మెడికల్ హెల్త్ ఉద్యోగి.

ప్రతి పుస్తకం కొనాలనిపించేలా ఉంది

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఏది చూసినా కొనాలనిపించేలా ఉన్నాయి. పిల్లల కోసం నైతిక విలువలు నేర్పించే పుస్తకాలు ఎక్కువగా ఉండటం నచ్చింది.

లిఖితాయ శ్వేత,
ఎంబిబిఎస్ విద్యార్థిని.

చాలా హ్యాపీగా ఉంది

వ్ర న్త క ప్రదర్శనకు మామూలుగా వచ్చా. ఈ ప్రదర్శనలో ఉన్న పుస్తకాలు చూశాక భిన్నమైన అనుభూతి కలిగింది. ఎంతో విజ్ఞానం, స్ఫూర్తిదాయకమైన అనేక పుస్తకాలను చూసి మనసులో హాపీ ఫీల్ ఏర్పడింది.

పి. ఇందుమతి,
ఎంబిబిఎస్ విద్యార్థి.

పోటీ పరీక్షలకు దోహదపడేలా ఉన్నాయి

ఈ పుస్తక ప్రదర్శనలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే తాజా ఎడిషన్ పుస్తకాలు లభించాయి. ఎవరైనా కొనుక్కునేందుకు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. ఇలాంటివి మాకు చాలా ఉపయోగపడతాయి.

వంశీ,
డిగ్రీ , విద్యార్థి

దేవరకొండ బాలగంగాధర్ పుస్తకం కొన్నాను

ఎ ద ర రచయితల గ్రంథాలన్నీ ఒకచోటే లభించడం అరుదు. దేవరకొండ బాలగంగాధర్ తిలక్ వంటి కవి పుస్తకాలు దొరకడం కష్టం. అలాంటి పుస్తకాలను, ఆధ్యాత్మిక గ్రంథాలు, జీవిత దిశను చూపించే పుస్తకాలు మనసుకు హత్తుకున్నాయి.

పి. రవీంద్రనాథ్,
కవి, టీచర్.

2 వరకు ప్రదర్శన కొనసాగుతుంది

సిఐటియు మహాసభలు సందర్భంగా పాఠకులకు అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు ఉంచాలనే విశాఖ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశాం. సుమారు 100 మంది ప్రచురణ కర్తలకు సంబంధించి లక్ష పుస్తకాలను ఈ ప్రదర్శనలో ఉంచాం. దేశ భక్తులు, పోరాటయోధుల పుస్తకాలు, ఉత్తరాంధ్ర, రాష్ట్ర కవులకు సంబంధించిన పుస్తకాలు ఉంచాం. పిల్లల నుంచి పెద్దల దాకా అన్ని రకాల పుస్తకాలు అందుబాటు ధరల్లో అందిస్తున్నాం. జనవరి 2 వరకు కొనసాగే ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయ్ కిరణ్,
పుస్తక ప్రదర్శన నిర్వాహకులు.

చాలా బాగుంది.. మళ్లీ వస్తా

కార్టూన్, ఆటలతో కూడిన పుస్తకాలు చాలా ఉన్నాయి. స్కూల్ పుస్తకాలకు అనుబంధంగా కొన్ని ఉన్నాయి. దాడీని తీసుకొని మళ్లీ వస్తా.

లక్ష్మీ సహస్ర,
విద్యార్థిని, ఏడో తరగతి.

సామాజిక చైతన్యానికి ప్రతీకగా లఘు చిత్రాల ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విశాఖనగరంలో ఈనెల 31 నుంచి జరగనున్న సిఐటియు 18వ జాతీయ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రామిక ఉత్సవం కళాకారుల సృజనాత్మకతకు, సామాజిక బాధ్యతకు వేదికగా నిలిచింది. ఆదివారం రెండో రోజు జరిగిన లఘు చిత్రాల ప్రదర్శనలో ఏడు చిత్రాలను ప్రదర్శించగా, ఇవి ప్రేక్షకులను ఆలోచింపజేయడంతో పాటు సమాజంలోని వివిధ కోణాలను ఆవిష్కరించాయి. ఈ ప్రదర్శనలో ప్రధానంగా సామాజిక సమస్యలు, రాజ్యాంగ హక్కులు, శ్రామిక జీవుల వ్యథలను కథా వస్తువులుగా తీసుకున్నారు.

- నిడదవోలుకు చెందిన మెహర్ కట్ల రూపొందించిన 'సాలగ్రామ హనుమంతరావు' చిత్రంతో ప్రారంభమైన ఈ ప్రదర్శన, ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

మాట్లాడుతున్న తేజభరత్

- శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొత్తపల్లి సీతారాం నిర్మించిన 'వీరి బతుకు' చిత్రం ఉత్తరాంధ్ర జనజీవన చిత్రణను, వారి కష్టాలను కళ్లకు కట్టినట్లు చూపింది.
- విజయవాడకు చెందిన ఆర్ భార్గవరాయ్ రూపొందించిన 'ఫ్రీడమ్ ఆర్టికల్ 21' ప్రస్తుత కాలంలో వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ పరమైన హక్కుల ప్రాముఖ్యతను ప్రశ్నించింది.
- రైతు సమస్యలపై కె.దుర్గారావు నిర్మించిన 'జై కిసాన్' చిత్రం అన్నదాతల ఆవేదనను ప్రతిబింభించగా, ఉమామహేష్ నిర్మించిన 'ఇంక్' చిత్రం విలక్షణమైన ముగింపుతో ఆకట్టుకుంది.
- విశాఖకు చెందిన మోటూరు శ్రీనివాస్ కుమార్ నిర్మించిన శర్మదేవోభవ లఘు చిత్రం చదువుకున్న మేధావి వర్గం, మధ్యతరగతి కుటుంబాలు సమాజం పట్ల ఉండాల్సిన బాధ్యతను ప్రశ్నించింది.
- విశాఖపట్నంకు చెందిన సనరా వంశీ నిర్మించిన మాతృదేవోభవ లఘు చిత్రం తల్లి ప్రేమ, బాధ్యత అన్న అంశానికి సామాజిక బాధ్యతను జోడించి ప్రస్తుత సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, మాతృమూర్తి పట్ల సమాజంలో ప్రదర్శించాల్సిన గౌరవం వంటి అంశాలను ఇందులో చర్చించినట్లు కనిపిస్తుంది.
- విశాఖపట్నంకు చెందిన దర్శకుడు ఉమామహేష్ నిర్మించిన ఇంక్ లఘు చిత్రం రాతకు ఉన్న శక్తిని, కలం పట్టిన మేధావి సమాజంలో ఎలాంటి విప్లవాన్ని ఎలా తీసుకురాగలడో వివరించింది.

లఘుచిత్రాలు సమాజంలో మార్పు తీసుకొచ్చే ఆయుధాలు : విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజభరత్

ఈ ప్రదర్శనను తిలకించిన విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజభరత్ దర్శకులను ప్రత్యేకంగా అభినందించారు. లఘు చిత్రాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సమాజంలో మార్పు తీసుకొచ్చే ఆయుధాలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా యువ దర్శకులు వాస్తవికతకు దగ్గరగా చిత్రాలను నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలు కేవలం విశాఖకే పరిమితం కాకుండా విజయవాడ, నిడదవోలు, ఖమ్మం వంటి ఇతర ప్రాంతాల కళాకారులకు ఇది ఒక గొప్ప వేదికగా నిలిచింది. తక్కువ నిడివిలో ఎక్కువ ప్రభావాన్ని చూపేలా సామాజిక సమస్యలను విశ్లేషించడం దర్శకుల పరిణతిని తెలియజేస్తుంది. వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్ అసోసియేషన్ సభ్యులైన ఎల్లాజీ, కుమార్ రాజా తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కళాకారుల మధ్య సమన్వయాన్ని పెంచింది. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ ప్రదర్శనలు, కళ అనేది కేవలం కళ కోసం మాత్రమే కాదు, అది ప్రజల కోసం అనే సందేశాన్ని బలంగా చాటిచెప్పాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
సోమవారం 29 డిసెంబర్ 2025

శ్రామిక ఉత్సవ్ అదరహో

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

- ఆకట్టుకున్న కళా, విజ్ఞాన, సాహిత్య వేదికలు
- అబ్బురపరిచిన నృత్య రూపకాలు : ఆలోచింపజేసిన సైన్స్ ప్రదర్శనలు - శ్రమకవనానికి స్పందన

రెండో రోజు ఆదివారం విశాఖ సాగర తీరం ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వీక్షకుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. అత్యధిక సంఖ్యలో ఇక్కడి ఎగ్జిబిషన్ స్టాల్స్ వద్ద ప్రజలు గుమిగూడి తిలకించారు. ప్రజానాట్య మండలి కళాకారుల బృంద గానాలు, కళాకారుల సోలో పాటలు ఆద్యంతం వీక్షకులందరినీ ఉర్రూతలూగించాయి. చిన్న పిల్లలు సైతం 'శ్రామిక ఉత్సవ్' వేదికపై జరిగిన డ్యాన్సులకు హావభావాలతో ఆనందిస్తూ కేరింతలు కొట్టడం, కోలాటం కర్రలతో నృత్యం చేయడం కనిపించింది. ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ ఇక్కడి కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని తలపెట్టిన 'శ్రామిక ఉత్సవ్' రెండో రోజూ సందడి నింపింది. సైన్స్, కార్టూన్ ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి. శ్రమకవనం ఆలోచింపజేసింది.

కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న యువ కళాకారులు

శ్రామిక ఉత్సవ్‌కు హాజరైన ప్రజానీకం

విప్లవగీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

విద్యార్థుల నృత్య రూపకం

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

నాటికలోని ఓ సన్నివేశం

మాట్లాడుతున్న కృష్ణయ్య



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న వైద్య విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యార్థుల కళారూపాలు

కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న తేజభరత్, చిత్రంలో సిహెచ్.నర్సింగరావు

స్ఫూర్తి నింపిన మందస జీడి కార్మికుల పోరాటం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వందలాది జీడి పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. యాజమాన్యం ఎంత దయతలిస్తే అంతే కూలీ తీసుకుంటున్న పరిస్థితి ఉంది. కానీ, మందస ప్రాంత జీడి కార్మికుల పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. తమకు పనికి తగ్గటు కూలి కోసం సంఘటితంగా పోరాడి స్ఫూర్తిగా నిలిచారు. యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. చివరకు అధికారులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పించారు. యాజమాన్యం, కార్మికులతో చర్చించి కూలీ రేట్లు పెంచేలా అధికారులు ఆదేశించారు. ఇది జిల్లాలో పని చేస్తున్న ఇతర జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల్లో స్ఫూర్తిని నింపింది. మందస ప్రాంతంలోని హరిపురం, భైరిసారంగపురం, రాధాకృష్ణాపురం పరిసర గ్రామాల్లో మొత్తం ఏడు వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో సుమారు 300 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మందస, సారంగపురం, మూలిపాడు, పింపిలి, సిద్ధూరు, తొండిపూడి, రాధాకృష్ణాపురం తదితర గ్రామాల నుంచి పరిశ్రమలో పనిచేస్తున్నారు. అంతా రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు చెందిన వారే. దుర్భరమైన బతుకులతో భారంగా జీవనం నెట్టుకొస్తున్నారు. వీరికి కనీస కూలీ ఇవ్వకుండా యాజమాన్యం దోపిడీ సాగిస్తోంది. పిక్కలను ఒలవడానికి ధర ఇవ్వకుండా దాని నుంచి వచ్చిన పప్పు ఆధారంగా యాజమాన్యం డబ్బులు ఇస్తోంది. నాలుగు కేజీల పిక్కలను వలవగా వచ్చే కేజీ జీడిపప్పుకు రూ.32 కూలీ ఇస్తున్నారు. కూలీ రేట్ల ఒప్పందం ముగిసినా యాజమాన్యం దానినే కొనసాగిస్తుండటంతో తమకు రేట్లు పెంచాలని యాజమాన్యాన్ని కోరారు. దీనిపై యాజమాన్యం ప్రతినిధులు ససేమిరా అనడంతో కార్మికులు సంఘటితమై సిఐటియు ఆధ్వర్యాన అనేక రూపాల్లో ఆందోళనలు సాగించారు.

శ్రీకాకుళం : మందసలో కూలీ రేట్ల పెంపు కోసం ర్యాలీ చేస్తున్న జీడి కార్మికులు (ఫైల్)

మహిళా కార్మికులకు మరుగుదొడ్లూ కరువే

ఆందోళనలతో దిగొచ్చిన యాజమాన్యం
ఏ జీడి పరిశ్రమలో ఇవ్వని కూలీ రేటును దక్కించుకున్న వైనం

జీడి పరిశ్రమల్లో పనిచేసేందుకు వచ్చిన వారిలో అధిక శాతం మంది మహిళలే ఉన్నారు. యాజమాన్యాలు వారికి కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించడం లేదు. భోజనాలు చేసేందుకు గదులు కూడా ఉండకపోవడంతో అపరిశుభ్ర పరిస్థితుల నడుమే ఆహారం తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. కనీసం కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు నీళ్లు కూడా లేని పరిస్థితి ఉంది. బడిలో చేర్చని పిల్లలతో వస్తున్న తల్లులు అక్కడ పడరాని పాట్లు పడుతున్నారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించాలంటూ కార్మికులు తమ పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు.

పోరాట ఫలితంగా పెరిగిన కూలి రేట్లు

కూలీ రేట్ల విషయంలో తమకు జరుగుతున్న అన్యాయంపై విశాఖపట్నంలోని జాయింట్ కమిషనర్ ఆప్ లేబర్, డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతిపత్రం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో టెక్కలి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ యాజమాన్యాల ప్రతినిధులతో చర్చలు జరపడంతో రేట్లు పెంచేందుకు అంగీకరించింది. అప్పటివరకు కేజీకి రూ.32 ఉన్న కూలీని రూ.34.50కు పెంచింది. దీంతో జిల్లాలో ఏ జీడి పరిశ్రమల్లోనూ లేని రేటు వారికి దక్కింది. లేబర్ కమిషనర్ల ఒత్తిడితో రేట్లు పెంచిన యజమాన్యం ప్రతినిధులు వారిపై ఒకరకంగా కక్ష సాధింపు చర్యలకు దిగింది. పరిశ్రమకు వచ్చేందుకు అప్పటివరకు ఏర్పాటు చేసిన ఆటోలను ఆపేసింది. వారికి పనిదినాలు తగ్గించేలా ప్లాన్ చేసింది. గ్రామాల్లో అనధికారికంగా షెడ్లు ఏర్పాటు చేసి అక్కడ పనులు ప్రారంభించింది.


కార్టూన్‌లను ప్రదర్శిస్తున్న బాలిక

చిన్నచిత్రం... పెద్ద సందేశం

ఆకట్టుకున్న కార్టూన్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -ఆనందపురం

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు సందర్భంగా నిర్వహించిన కార్టూన్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌లో చిన్న చిత్రాల ద్వారానే పెద్ద సందేశాలను సమాజానికి చేరవేయవచ్చని నిరూపించారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు వందమంది కార్టూనిస్టులు పాల్గొని సామాజిక, రాజకీయ, శ్రామిక వర్గ సమస్యలను ప్రతిబింభించే కార్టూన్లను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లో సూపర్ సీనియర్ విభాగంలో రామారావు ప్రథమ స్థానం, ప్రసాద్ ద్వితీయ స్థానం, సుధాకర్ తృతీయ స్థానం సాధించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ప్రభుత్వ విధానాలను మేకల బలితో పోల్చుతూ రామారావు రూపొందించిన కార్టూన్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్టూన్‌కు గానూ ఆయనకు ప్రతిభా బహుమతి అందజేశారు. అలాగే కార్టూనిస్టు ప్రసాదు మతసామరస్యత, సామాజిక ఐక్యత, యువత ఉద్యోగ సమస్యలు, కలలు - వాస్తవాల మధ్య వ్యత్యాసాలను తన కార్టూన్లలో సృజనాత్మకంగా ప్రతిబింభించారు. శ్రామిక యువకులు, కార్పొరేట్ శక్తులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్న సందేశాన్ని ఆయన కార్టూన్లు స్పష్టంగా చాటాయి. వర్క్ ఫ్రమ్ హెూమ్, ఇంటి పనులు, విద్య, టీవీ సీరియల్స్ మధ్య మహిళల ఆలోచనలను హాస్యాత్మకంగా కార్టూన్ రూపంలో చూపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్టూన్ పోటీలకు బి.హరి వెంకట రమణ, కోరాడ రాంబాబు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

విజేతలు వీరే.... (ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు)

సూపర్ సీనియర్ విభాగం : రామారావు, ప్రసాదు, సుధాకర్

సీనియర్ విభాగం : రష్మిక, ప్రేమ్, శిల్ప, సజన

జూనియర్ విభాగం : నిర్మల్, హైది, భువన

ఉత్సాహంగా సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఆనందపురం

విశాఖపట్నం ఎయు మైదానంలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు సందర్భంగా రెండో రోజు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఉత్సాహంగా సాగింది. ఈ ఎగ్జిబిషన్‌లో 18 కళాశాలల నుంచి సుమారు 50 సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. తగరపువలస ఎన్ఆర్ఐ విద్యార్థులు, మెడికల్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన లైవ్ డెమోలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సిఐటియు జాతీయ తొలి అధ్యక్షులు నుంచి 17 వరకు ఫొటోలను రైల్వే బోగీల ఆకృతిలో ప్రదర్శించిన డెమో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐక్యత శక్తిని వివరించేలా గాజు పెంకులపై సమూహంగా నడిస్తే ఎలాంటి హాని జరగదని, ఒక్క గాజు పెంకుపై నడిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని వివరించారు. అలాగే మేకులను సమూహంగా అమర్చి వాటిపై కూర్చుంటే హాని కలగదని, ఒక్క మేకుపై కూర్చుంటే ప్రమాదం జరుగుతుందనే ప్రయోగాలు ఐక్యత ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేశాయి.

ఆకట్టుకున్న మాయ లేదు... మంత్రం లేదు... మ్యాజిక్ షో

మ్యాజిక్‌షో ప్రదర్శిస్తున్న శ్రీరాములు

అదేవిధంగా 'మాయ లేదు, మంత్రం లేదు' అనే సందేశంతో నిర్వహించిన మ్యాజిక్ షో ప్రదర్శకులను ఆకట్టుకుంది. జన విజ్ఞాన వేదిక ప్రతినిధి సిహెచ్ శ్రీరాములు (ధవలేశ్వరం) మ్యాజిక్ షో నిర్వహించారు. అందులోని రహస్యాలను శాస్త్రీయంగా వివరిస్తూ ప్రేక్షకుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు. నీళ్లు లేకుండానే సీసాలో నీళ్లు రావడం, గాలిలో నుంచి పూలు పుట్టించడం, కాగితాలు తానుగా మార్చడం, తెల్ల కాగితాలపై అక్షరాలు కనిపించడం వంటి ప్రయోగాలను ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ మూఢనమ్మకాలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు శాస్త్రీయ అవగాహన అవసరమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు జి. మురళీధర్ ప్రసాద్, పరశురాం, శేషగిరిరావు, రత్నారావు, స్వామి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు

ఎగ్జిబిషన్‌కు సైన్ నమూనాను తీసుకొస్తున్న విద్యార్థులు

అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న దృశ్యం

పసి ప్రాణం... అంతుచిక్కని రోగం

ముద్దు ముద్దు మాటలతో, చిలిపి నవ్వులతో, కేరింతలతో ఆ తల్లి కొంగు పట్టుకుని తిరిగే కుమారుడిపై విధి కన్నుకొట్టింది. అంతుచిక్కని వ్యాధితో మంచానికే పరిమితం చేసింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు ఉలుకుపలుకు లేకుండా మంచాన పడి వుండడంతో ఆ తల్లి మనసు తల్లడిల్లి పోయింది. కొడుకు ఒక్కసారైనా అమ్మ అని పిలవకపోతాడా అని గంపెడు ఆశతో ఎదురు చూస్తుంది.

దాతల సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ మండలం పాలవలస పంచాయతీ పరిధిలోని మర్రిపాడు గ్రామానికి చెందిన జంపా త్రినాథరావు, గాయత్రి దంపతుల కుమారుడు చైతన్య అరుదైన వ్యాధితో బాధ పడుతున్నాడు. నవమాసాలు మోసి కని పెంచిన కొడుకు వేలాది మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో ఉలుకుపలుకు లేకుండా మంచాన పడి వుండడంతో పుట్టెడు దు్ఖఃఖాన్ని కడుపులో దాచుకుని తమ కొడుకును కంటికి రెప్పలా కాపాడు కుంటున్నారు. ఆదేవుని శాపమో, విధికి కన్ను కొట్టిందో ఏమోగాని మాయదారి రోగంతో పసి ప్రాణం విలవిలాడుతుంది. ఐదేళ్ల వయసులో వచ్చిన జ్వరం తగ్గక పోవడంతో శ్రీకాకుళం ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా బ్రెయిన్ వైరస్ (ఎస్ఎస్‌పిఇ) అరుదైన వ్యాధి వచ్చిందని వైద్యులు చెప్పడంతో తల్లి దండ్రులు ఒక్కసారిగా బోరున విలపించారు. తమ కుమారుని ఆరోగ్య వంతుడిగా చేసుకు నేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు.

అప్పులతో వైద్యం

అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడికి వైద్యం చేయించేందుకు ఆ తల్లిదండ్రుల ఆరాటం ఇంత అంతా కాదు. ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి వైద్యం చేయిస్తున్నారు. అప్పటినుంచి చైతన్య నడవలేడు, కూర్చోలేడు, తినలేడు, మాట్లాడలేడని, నొప్పిగా ఉంటే గుండెలు కొట్టుకుంటాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుని పరిస్థితిని చూసి తట్టుకోలేక పోతున్నారు. ఇప్పటికే విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడ వంటి పట్టణాల్లో చైతన్యకు వైద్యం చేయించారు. ఇదిలా ఉంటే ఈ వ్యాధి పూర్తిగా నయం అయ్యేందుకు చాలా సమయం పడుతుందని, ఖరీదైన వైద్యం అందించాల్సి ఉంటుందని వైద్యులు చెప్పటంతో కొంతమంది వైద్యుల సలహాలతో మహారాష్ట్రలోని పూణేలో సెంట్ ఫర్ లైఫ్ సైన్సెస్ హోమియోథెరఫీ డాక్టర్ పవ్వల్ గువ్వంత్ అర్జునులు వద్ద చికిత్స పొందు తున్నాడు. అయితే అక్కడికి ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్యం కోసం వెళ్లి వచ్చేం దుకు రూ.50 వేలు వరకు ఖర్చు అవుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

చైతన్య

అందని ప్రభుత్వ సాయం

గత మూడు సంవత్సరాలుగా తమ కుమారుడు మంచానికి పరిమితం అయ్యాడు. అటు వైసిపి ప్రభుత్వంలో, ఇటు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కూడా నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ కుమారుడికి పెన్షన్ మంజూరు చేయాలని, సిఎం సహాయనిధి నుంచి వైద్యానికి నిధులు సమకూర్చాలని ఎన్నోమార్లు ఫిర్యాదు చేయడం జరిగిందని, అయితే ఒకరు కూడా కరుణించలేదని వాపోయారు. ఇది తమ దురదృష్టమని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇదే విషయంపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పార్టీ కార్యాలయానికి రెండురోజుల క్రితం బాబుని తీసుకుని వెళ్లామని, అయితే పింఛను మంజూరుకు హామీ ఇచ్చారని తల్లిదండ్రులు తెలిపారు.

వింతవ్యాధితో తల్లిని కూడా గుర్తుపట్టలేని బాలుడు

దాతలసాయం కోసం ఎదురుచూపు

కూలి చేసుకొని పొట్ట నింపుకునే తమ బతుకులకు విధి వెక్కిరించిందని తల్లిదండ్రులు వాపోయారు. కూలి చేస్తేనే కడుపునిండేదని అయితే తమ కుమారుడిని వైద్యం అందించేందుకు అన్ని రకాలుగా అప్పులు చేశామని, మనసున్న మారాజులు దాతలు కరుణించి వైద్యం కోసం సాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దాతలు ముందుకు వచ్చి జంప గాయత్రి, 9502254379 నంబర్‌కు ఫోన్ పే గాని, యూనియన్ బ్యాంకు సంబంధించిన అకౌంట్ నెంబర్ 043910100217023, ఐఎఫ్‌సి కోడ్ UBIN 0804398 దాతలు స్పందించి వైద్యానికి సహక రించాలని గ్రామస్తులు, పలువురు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, తల్లి దండ్రులు కోరుతున్నారు.

మేధస్సుకు పదును పెట్టేవే సిక్కోలు లఘు చిత్రోత్సవాలు

లోగో ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం పట్టణం, రూరల్ మండలం అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో ఆదివారం సిక్కోలు లఘు చిత్రోత్సవం 2025 లోగో ఆవిష్కరణ కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ యువత మేధస్సుని వెలికి తీసే ప్రయత్నంలో భాగమని, దీనిద్వారా టాలెంట్ వ్యక్తం అవుతుందన్నారు. కార్యక్రమం జిల్లాలో ఎంసిఎ, పికె టీం ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షనీయమన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ షార్ట్ ఫిలిం ఫెస్టివల్స్ శ్రీకాకుళంలో నిర్వహించడం పలువురు నటులు, డైరెక్టర్లు, రచయితలకు ప్రోత్సహించే దిశలో మీరు చేస్తున్న ప్రయత్నాలు అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో ఎంసిఎ వ్యవస్థాపక అధ్యక్షులు మణిపాత్రుని నాగేశ్వరరావు, కార్యదర్శి తిరుమలరావు, పికె టీం ప్రసాద్, కీర్తి, రామకృష్ణ, రాము, మాదారపు వెంకటేశ్వరరావు, ఎస్.వి రమణ మాదిగ, తెలుగు యువత విశ్వేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ కణితి సూర్యనారాయణ, ఏలియన్స్ క్లబ్ మెంబర్స్ జామి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కుతున్న ఎమ్మెల్యే శంకర్

బాపూజీ కలలను సాకారం చేద్దాం

శ్రీకాకుళం సిటీ: స్వచ్ఛభారత్ కోసం, బాపూజీ కన్న కలలను, మనమందరం కలిసి సాకారం చేద్దామని ఎమ్మెల్యే గొండు.శంకర్ అన్నారు. ఎనబై అడుగుల కూడలి వద్దగల ఆనందమయ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమైన రన్‌ఫర్ స్వచ్ఛభారత్ ఆదివారం ప్రారంభించి మాట్లాడు తూ భారతదేశంలో ఉండే అన్ని కిష్ణ డైమండ్స్ కార్యాలయాల్లో సుమారు వందకుపైగా, ఒకే సమయంలో 5కె మారథాన్‌ను నిర్వహించటం దేశానికే ఆరోగ్య స్ఫూర్తిదాయకమన్నారు. నిర్వాహకులు పొట్నూరు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని, మనం స్వచ్ఛంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉండగలమని, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. 526 మంది రన్‌ఫర్‌లో పాల్గొన్నారని, స్వచ్ఛభారత్‌లో భాగంగా కృష్ణ డైమండ్స్ అందించిన నగదును శ్రీకాకుళం స్వచ్ఛతకై మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌కు అందించారు.

శక్తి యాప్‌పై అవగాహన

టెక్కలి రూరల్ : మండలంలోని తెలినీలాపురంలో శక్తియాప్ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శక్తి టీం ఇన్‌ఛార్జి గిరిధర్ ఆధ్వర్యాన సైబర్ క్రైమ్స్, యాంటీడ్రగ్స్, రోడ్, సేఫ్టీపై వివరించారు. శక్తి యాప్ గ్రామస్తులతో డౌన్‌లోడ్ చేయించి ఉపయోగాలను తెలియజేశారు. అన్ని పోలీస్ సేవలకు శక్తియాప్ ఉపయోగపడుతుందని టీమ్ సభ్యులు తెలియజేశారు. సర్పంచ్ పోలాకి లక్ష్మి, ఉమెన్, పిసి యశోద, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమా పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని మకరాంపురం వద్ద ఆదివారం విశ్వశాంతి క్రికెట్ అసోసియేషన్, ఫిజిక్స్ వాలా, శ్రీవృక్ష విద్యా సంస్థల ఆధ్వర్యాన నిర్వహించిన అంతర్రాష్ట్ర టి-20 క్రికెట్ పోటీలను ఆదివారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇటువంటి పోటీలు, క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తాయన్నారు. స్థానికంగా ఎన్నో అంతర్రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తూ, క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తున్న విశ్వశాంతి క్రికెట్ అసోసియేషన్ సేవలు ఆదర్శనీయమన్నారు. బ్యాటింగ్ చేస్తూ క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తమరాల శోభన్, శ్రీవృక్ష అధినేతలు బి.వి.రమణ, తిలక్, క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగేష్, టి.వి.రమణ, జె.వి.భాస్కరరావు, బి.మృత్యుంజయరావు, కామేష్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న విప్ అశోక్

పోటీల్లో భాగంగా మొదటి రోజు ఒడిశాకు చెందిన కల్లికోట టీమ్, పాలకొండ టీమ్‌ల మధ్య మొదటి మ్యాచ్ నిర్వహించారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కలికోట టీమ్ 20 ఓవర్లలో 8 వికెట్ల కోల్పోయి 140 పరుగులు చేసింది. అనంతరం పాలకొండ టీమ్ 14.2 ఓవర్లలో కేవలం నాలుగు వికెట్లు కోల్పోయి 141 పరుగులు సాధించి విజయం సాధించింది.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ప్రమాదాల నివారణకు సిసి కెమెరాలు, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కాశీబుగ్గ డిఎస్‌పి షేక్ షాహబాజ్ అహ్మద్ మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కాశీబుగ్గ ప్రాంతంలో మున్సిపల్ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, కాశీబుగ్గ జెడ్‌పి హైస్కూల్, కాశీబుగ్గ బస్టాండ్, బస్సులు ఆగే స్థలం వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మాణం చేపట్టాలన్నారు. రోడ్లపై బైక్ రేసింగ్ చేపట్టిన, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలతో ప్రయాణం చేసిన అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కాశీబుగ్గ సిఐ వై.రామకృష్ణ, కమిషనర్ ఇ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి షేక్ షహబాజ్ అహ్మద్

ఆదిత్యుని ఆదాయం రూ.4.4లక్షలు

ప్రజాశక్తి- అరసవల్లి

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో యాత్రికులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఇఒ ప్రసాద్ ఆధ్వర్యంలో టెంట్లు వేసి, క్యూ లైన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాత్రికులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా స్వామి వారికి రూ.4 లక్షల 6,415 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ కెఎన్‌విడివి ప్రసాద్ తెలిపారు. టికెట్లు అమ్మకం ద్వారా లక్షా 63,600, పూజలు, విరాళాల రూపంలో రూ.29,955, ప్రసాద విక్రయం ద్వారా రూ.లక్షా 11,795, ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా రూ.లక్షా 1065 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

త్వరలో డే అండ్ నైట్, రామలక్ష్మణ రోడ్డు విస్తరణ

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజారంజక పాలన అందిస్తున్న కూటమి సర్కారుతోనే అభివృద్ధి ముడిపడి ఉందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కార్పోరేషన్ పరిధిలో రూ.18.50 లక్షల నిధులతో ఎల్.బి.ఎస్ కాలనీలో సిసిరోడ్డును ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్పోరేషన్ స్థాయి అభివృద్ధిని ఇప్పుడు శ్రీకాకుళం సాధిస్తోందని, ప్రాధాన్యతా క్రమంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నామని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసే రహదారులను డ్రైన్లతో సహా అభివృద్ధి చేస్తూ విజన్‌ను అమలు పరుస్తున్నామని స్పష్టం చేశారు. డే అండ్ నైట్ నుంచి రామలక్ష్మణ వరకూ ఉన్న అత్యంత రద్దీగా ఉండే రహదారిని అభివృద్ధి చేయడం తన ఎన్నోఏళ్ల కలని అన్నారు. రోడ్డును ఆనుకుని వ్యాపారం చేసేవారు కూడా స్వచ్ఛందంగా ముందుకు రావడంతో భవిష్యత్‌లో ఈ రోడ్డు కూడా విస్తరిస్తున్నామని తెలిపారు. సుడా నుంచి నిధులు మంజూరు చేయించి ఎనబై అడుగుల రహదారిని అతిత్వరలో నిర్మిస్తామని స్పష్టం చేశారు. రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల ట్రాఫిక్‌తో నిత్యం నగర వాసులు ఇబ్బంది పడుతూనే ఉన్నారని, దీనికి త్వరితగతిన పరిష్కార మార్గం చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మార్కింగ్ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేసినా ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వామ్యమై వాలంటీర్‌గా కార్యక్రమాలు చేయాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు.

అరుణ్ కుమార్‌కు సన్మానం

కొత్తూరు: టిడిపి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన ఆగతముడి అరుణకుమార్‌ను టిడిపి కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, మాజీ వైస్ ఎంపిపి, గురండి ఎంపిటిసి అగతముడి భైరాగినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీలు ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎద్దు దాస్‌నాయుడు, ఎల్.భగవాన్‌దాస్‌నాయుడు, టి.తిరుపతి రావు, నూకరాజు, గోగుల వరప్రసాదరావు నాయుడు, పి.లక్ష్మణరావు, డి.శ్రీను, ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

రూ.పది వేలు ఆర్థికసాయం

కొత్తూరు : స్థానిక రెల్లివీధికి చెందిన నాగవంశపు రవికుమార్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం మెడికవర్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నిలమణిదుర్గ లారీ, వ్యాన్, ఓనర్స్ యూనియన్ అసోసియేషన్ ఆదివారం యువకుడి తల్లితండ్రులు మల్లేష్, అదిలక్ష్మిలకు రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ చోడవరం వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ ఇసై నాగరాజు, సెక్రెటరీ పిన్నింటి ధర్మారావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

జమ్ము శ్రీనును పార్టీలోకి ఆహ్వానిస్తున్న యశస్వి

జనసేనలోకి జమ్ము శ్రీను

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

జమ్ము నారాయణపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు నడిపేన శ్రీనివాసరావు(జమ్ము శ్రీను) ఆదివారం జనసేన పార్టీలో చేరారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని మెసానిక్ టెంపుల్ వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ వెల్ఫేర్ డెవలప్ మెంట్ చైర్‌పర్సన్, నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పాలవలస యశస్వి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. గత 35 సంవత్సరాలుగా రాజకీయాలలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకుని ఉన్న ఆయనతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అయిన ఆయన కుమార్తె శశి భార్గవి కూడా జనసేన కండువా వేసుకున్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, ఆలోచనలు నచ్చి జనసేన పార్టీలో చేరినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్న పరిశ్రమల డెవలప్మెంట్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, మాజీ మంత్రి, జనసేన పార్టీ పిఎసి మెంబర్ పడాల అరుణ, జనసేన మండల అధ్యక్షులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, వీర మహిళలు పాల్గొన్నారు.

క్షత్రియ యూత్ పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కంటోన్మెంట్

క్షత్రియ యూత్ పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం స్థానిక పివిజి రాజు క్షత్రియ కళ్యాణ మండపం లో అధ్యక్షులు శేఖర్ రాజు, కార్యదర్శి లక్ష్మీపతివర్మ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా క్షత్రియ పరిషత్ అధ్యక్షులు పెనుమత్స సీతారామ రాజు, కార్యదర్శి సాగి సీతారామ రాజు, కోశాధికారి గొట్టిముక్కల రామరాజు హాజరై ప్రసంగించారు అనంతరం నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. కొత్త అధ్యక్షులుగా ఇందుకూరి సూర్యనారాయణ రాజు, కార్యదర్శిగా రాయవరపు సంతోష్ రాజు, కోశాధికారిగా పికెఎల్ వర్మ ఎన్నికయ్యారు. వీరితో పాటు 22 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీతారామరాజు మాట్లాడుతూ పరిషత్‌తో సభ్యులందరూ కలిసి కట్టుగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. శివాజీ రాజు మాట్లాడుతూ కేవలం క్షత్రియులకు కాకుండా సమాజం లో ఉన్న అందరి పట్ల సేవా భావం తో మెలగాలని, అందరికీ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

తప్పెటగుళ్ళు వేస్తున్న నృత్యకారులు

కళల ప్రోత్సాహానికి చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

కళకను ప్రోత్సాహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో ఆదివారం బొబ్బిలి కళోత్సవం పేరుతో ప్రాచీన జానపద కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళలను, కళాకారులను ప్రోత్సాహించేందుకు కళోత్సవం నిర్వహించామన్నారు. కళాకారులను గౌరవించాలని కోరారు. చిన్నారులు నిర్వహించిన ఏమి బతుకులు బుర్రకథ, కోలాటం, చెక్క భజన, తప్పెటగుళ్ల ప్రదర్శన, జానపద గేయాలు, శకలక శంకర్ హాస్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్

ప్రజాశక్తి- విజయనగరం కోట

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఉదయం 10గంటలకు రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌డిఒ కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాలలో దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత ఎఒ, డిటిలు అందుబాటులో ఉండాలని సూచించారు. తహశీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తమకు సంబంధించిన అన్ని రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రైతులు, ప్రజలు తమ భూసంబంధిత సమస్యలు, రెవెన్యూ సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఆకులపేట పంచాయతీలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించనున్న సిసి డ్రైన్ (మురుగు కాల్వ) పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే 'పల్లె పండగ' ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రతి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, పరిశుభ్రమైన వాతావరణాన్ని పెంపొందించడమే లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

పంచాయతీ కావాలని వినతులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జనసేన నాయకునికి వినతి పత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

ఎస్‌కోట మేజర్ పంచాయతీ పరిధిలోని సీతంపేట గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించాలని ప్రత్యేక గ్రామసభ ద్వారా తీర్మానం పొందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇప్పటికే గ్రామ పంచాయతీ తీర్మానం చేసి జిల్లా అధికారులకు పంపినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పార్టీలకతీతంగా పంచాయతీ సాధన కోసం సీతంపేట గ్రామ పెద్దలంతా ఏకతాటిపైకి వచ్చి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణకు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. అందులో భాగంగా నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వబ్బిన సత్యనారాయణకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. సీతంపేటకు ప్రత్యేక పంచాయతీ హోదా కల్పించాలన్న అంశాన్ని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని సత్యనారాయణ భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీతంపేట పంచాయతీ సాధన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెత్త కుండీలు ఏర్పాటు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

చెత్త కుండీలను ఏర్పాటు చేస్తున్న సభ్యులు

రెడ్ క్రాస్ సొసైటీ ఎస్.కోట సబ్-యూనిట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆదివారం చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ యూనిట్ చైర్మన్ డాక్టర్ పి.వరలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రధాన లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. పరిసర పరిశుభ్రతపై సామాజిక జాగృతి కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ పరిధిలోని సీతంపేటలో కూడా ఇలాంటి చెత్త కుండీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ చైర్మన్ ఏ.మల్లేశ్వరరావు, విజయనగరం జిల్లా ఎమ్‌సి సభ్యులు డి.సూర్యారావు, యూనిట్ కోశాధికారి శ్రీనాథ్, వెంకన్న బాబు, సెక్రటరీ జి.ధనుంజయ్, లైఫ్ మెంబర్లు గోవిందరావు, గణేష్, మౌనిక, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హాయి హాయిగా..

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జల విహార్ వద్ద బోట్ షికారు చేస్తూ హాయి హాయిగా గడిపారు. ఆల్ ట్రైన్ వెహికల్ ఎక్కి పార్కు చుట్టుముట్టారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. 5డి థియేటర్‌ను వీక్షించారు. ఆనంద విహార్ వద్ద కేరింతలు కొడుతూ డ్యాన్సులు వేశారు. మెట్టుగూడ జలపాతం వద్ద స్నానాలు చేశారు.

అడ్వెంచర్ బైక్ నడుపుతున్న యువకుడు

జలవిహార్‌లో పర్యాటకుల సందడి

స్కై సైకిల్ తొక్కుతున్న యువకుడు

చిన్నారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జామి

అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం ఈ మూడు జిల్లాల కలిపి 172 మంది సభ్యులతో కూడిన స్నేహాంజలి ఫర్ పూర్ పీపుల్ ఆర్గనైజేషన్ జన్నివలస చిన్నారులకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి ఓ చిన్న పురింటిలో జీవిస్తున్న విషయం స్థానికంగా ఉన్న సామాజిక కార్యకర్త డోల గణపతి ద్వారా తెలుసుకొని స్నేహాంజలి ఫర్ ప్యూర్ ఆర్గనైజేషన్ సభ్యులు లోపింటి లక్ష్మణరావు , దాన రాంబాబు, సొంట్యాన అప్పారావు, మల్లవరపు రాజేష్, ఆర్గనైజేషన్ తరపున పిల్లల్ని కలుసుకొని వాళ్ళ పరిస్థితి తెలుసుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పేద వారి కష్టంలో భాగస్వామ్యం కావడమే తమకు ఆనందం అని తాము చేసే సహాయం చిన్నది ఐనా తమకు కలిగే సంతృప్తి వెల కట్టలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సామాజిక కార్యకర్త డోల గణపతికి అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతినిధులు

ఐదుగురిపై కేసులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని శివార ప్రాంతాల్లో డ్రోన్‌తో నిఘాపెట్టి ఓపెన్ డ్రింకింగు చేస్తున్న 5మందిపై ఒడి కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి దామోదర్ తెలిపారు. అయ్యన్నపేట గ్రామ శివారు ప్రాంతం, కలెక్టరు కార్యాలయ ప్రాంతం, పిజిఆర్ ఆసుపత్రి ప్రాంతం, ఇతర శివార ప్రాంతాల్లో డ్రోన్ తో నిఘా పెట్టి ఓపెన్ డ్రింకింగు చేస్తున్న వారిపై ఆదివారం డ్రోన్స్ సహాయంతో రైడ్స్ నిర్వహించి, ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న ఐదుగురిపై విజయనగరం 1వ పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసారని తెలిపారు. జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై ఆకస్మికంగా దాడులు నిర్వహించేందుకు డ్రోన్నును వినియోగిస్తున్నామన్నారు శివారు ప్రాంతాలపై డ్రోన్సు వినియోగించి, నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని

ప్రయివేటీకరిస్తే అంగీకరించేది లేదు

సిఐటియు హెచ్చరిక

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటీకరిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని సిఐటియు జిల్లా కార్యదర్శి బి వి రమణ హెచ్చరించారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షులు బిడ్డిక సుశీల అధ్యక్షతన ఎండిఎం నిర్వాహకుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో సిఎం చంద్రబాబు నాయుడు ఇలానే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటీకరించేందుకు ప్రయత్నాలు చేశారని, అప్పుడు సిఐటియు రాష్ట్రవ్యాప్త ఆందోళన నిర్వహించి ఆ ప్రయత్నాన్ని తిప్పికొట్టిందని గుర్తుచేశారు. మరలా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అలాంటి ప్రయత్నాలనే చేస్తోందని విమర్శించారు. కొంతమంది ప్రభుత్వ పెద్దలకు కమీషన్లు అందజేసేందుకు చేస్తున్న ప్రయత్నమే తప్ప ఈ నూతన స్మార్ట్ కిచెన్ల విధానం ఎట్టి పరిస్థితుల్లోనూ గిరిజన ప్రాంతానికి ఉపయోగపడదని అన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ఈ మార్పు వల్ల గిరిజన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందక పాఠశాలల్లో డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ప్రయత్నాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాలతి, మంగమ్మ, శకుంతల, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండంగి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఐ 101వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని బలిజివీధిలో ఆ పార్టీజెండాను జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఎగురవేశారు. తొలుత మొకర అప్పారావు విగ్రహానికి సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు అప్పురుభుక్త జగన్నాథం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. నాగభూషణం అధ్యక్షతన జరిగిన సభలో అశోక్ మాట్లాడారు. బ్రిటీష్ పాలకుల నిర్బంధకాండకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1925 డిసెంబరు 26న కాన్పూర్ (ఉత్తరప్రదేశ్) గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని, నాటి నుంచి ఎన్నో వీరోచిత పోరాటాలు, త్యాగాలు, మహత్తర విజయాలకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాయి రమణమ్మ, బుగతపావని, పొందూరు అప్పలరాజు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పూర్వవైభవం తెచ్చేందుకు కృషి

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

సిగడాపు బంగారయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-సాలూరు

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ కోరారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మహాత్మాగాంధీ చిత్రపటానికి ఒబిసి విభాగం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు, పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్యతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు ఉపాధి లక్ష్యంగా చేసుకుని దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని దెబ్బ తీసే విధంగా బిజెపి ప్రభుత్వం కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ చట్టానికి గాంధీ పేరు తొలగించడం ప్రజావ్యతిరేక నిర్ణయమన్నారు. దీనిపై జనవరి 5న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సిగడాపు బంగారయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ప్రజాశక్తి-పాలకొండ

ఎల్విజిజె కళాశాల 1977 - 78 బ్యాచ్ విద్యార్థుల కలయికను ఆదివారం నిర్వహించారు. నక్కలపేట సాయి నగర్ ప్రాంతంలో చక్రవర్తి నివాసం వద్ద కర్ణమౌళి, బొడ్డన అప్పన్న, చక్రవర్తి ఆధ్వర్యంలో వారంతా కలుసుకొన్నారు. పాత జ్ఞాపకాలు నెమరువేసుకొని సరదాగా గడిపారు.

గంగంపేట గ్రామంలో శిథిలమైన భవనంలో వంటలు చేస్తున్న ఎండిఎం కార్మికులు

శిథిల భవనాల్లోనే వంటలు

బిక్కుబిక్కుమంటున్న ఎండిఎం నిర్వాహకులు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బిటివాడ మోడల్ ప్రైమరీ పాఠశాల, గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు వీలుగా వంట గదుల సౌకర్యం లేదు. గతంలో నిర్మించిన పాఠశాల గదులే వంటశాలలుగా మారాయి. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అందులోనూ ఎటువంటి నిర్వహణ కొనసాగించకపోవడంతో మూలకు చేరాయి. ప్రస్తుతం పాఠశాలలకు వంట గదుల సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న భవనాల్లోనే నిర్వాహకులు వంటలు చేస్తున్నారు. ఇప్పటికే స్లాబ్ పెచ్చులూడి అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. ఏదైనా జరగరానిది జరిగితే దానికి బాధ్యులు ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి వంట గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు రూపం

ప్రజాశక్తి పాలకొండ

నగర పంచాయతీలో లక్షల రూపాయలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. సీమలవీధిలో లక్షల రూపాయలతో నిర్మించిన మరుగుదొడ్లు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. మరుగుదొడ్లకు నీటి సదుపాయం లేకపోవడంతో ప్రజలు దాని వైపు కూడా వెళ్లడం లేదు. 15, 16, 17 వార్డులకు మరుగుదొడ్ల ఉపయోగమని నిర్మించినా అవి కొంతకాలంగా అలంకార ప్రాయంగా మిగిలాయి. దీంతో ఆరుబయట మల, మూత్ర విసర్జనకు వెళ్తున్నారు. నగర పంచాయతీ అధికారులు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

అక్రమంగా మట్టి తరలించి చదును చేస్తున్న స్థలం

అక్రమంగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని అనుమతులు లేకుండా అక్రమ మట్టి తవ్వకాలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో అక్రమంగా తవ్వుతున్న మట్టి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా అంతర్రాష్ట్ర రహదారికి ఆనుకొని విచ్చలవిడిగా జెసిబితో మట్టి తవ్వి ట్రాక్టర్తో రియల్ ఎస్టేట్ వెంచర్కు తరలిస్తున్నా మైనింగ్, రెవెన్యూ, సచివాలయ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మైనింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం గాలిలో కలిసిపోతే, ఎక్కడి నుంచి ఆదాయం వస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీల హక్కుల కోసం ఐక్యపోరాటం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఆదివాసీల హక్కుల కోసం ఐక్యపోరాటానికి సిద్ధం కావాలని ఆలిండియా ఆదివాసీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మణమూర్తి కోరారు. ఆదివారం స్థానిక గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులను రాజకీయ నాయకులు కాల రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను రాజకీయ పార్టీలు నిర్వీర్యం చేస్తున్నాయని చెప్పారు. అనంతరం ఆలిండియా ఆదివాసీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కమిటీ మన్యం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్గా కె.సుబ్బారావు, వైస్ చైర్మన్లుగా ఎం.ముత్యాలు, బిడ్డిక తిమ్మయ్య, ఎం.రమణ, బి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా సిహెచ్.సీతారాం, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, పల్లా సురేష్ను ఎన్నుకున్నారు.

వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్లో ఎస్ఐ ఎం.రాజేష్ ఆదివారం వాహనాలను తనిఖీలు చేశారు. ద్విచక్రవాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు గతంలో పెండింగ్ ఉన్న కేసుల్లో అపరాధ రుసుం చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసు సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి

డిజిటల్ కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగర పరిధిలోని ధర్మపురిలో మెప్మా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన డిజి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్‌ను ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెప్మా ద్వారా అమలు చేస్తున్న డిజి-లక్ష్మి పథకం పట్టణ పేద మహిళలకు డిజిటల్ నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రూపొందించారని తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌గా మారి ఆదాయం పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ చిట్టీ రాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మహిళా అధ్యక్షులు అనురాధ బేగం, కుటుంబరావు, గేదెల అదిబాబు, సతీష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం కలెక్టరేట్ ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్య గురించి ఖచ్చితమైన మరియు పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. సోమవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. అర్జీలో పేరు, చిరునామా మరియు ఫోన్ నంబర్ స్పష్టంగా నమోదు చేయాలన్నారు. మున్సిపల్, మండల స్థాయితో పాటు అన్ని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా పిజిఆర్ఎస్ జరుగుతుందని తెలిపారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎన్‌సిడి అధికారి జగన్మోహన్‌రావు

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఎన్‌సిడి అధికారి జగన్‌మోహన్‌రావు

ప్రజాశక్తి-సీతానగరం

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరకుండా ఉంటాయని జిల్లా ఎన్‌సిడి అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు తెలిపారు. బూర్జ గ్రామంలో సర్పంచ్ గుజ్జల దాసు ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య నిర్వహణ ప్రక్రియ చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, వ్యర్థాలు, తుప్పలను యంత్రాలతో తొలగించారు. జెసిబి, ట్రాక్టర్ సాయంతో గ్రామంలో పలు ప్రదేశాల్లో పారిశుధ్య పనులు నిర్వహించి వ్యర్థాలను డంపింగ్ వద్ద పారబోశారు. చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదని గ్రామస్తులకు ఆయన సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో పరిశు భ్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. వ్యక్తిగత శు భ్రతతోపాటుగా మనం నివసించే పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగకారక జనితాలకు ఆస్కారం ఉండదని, వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని అన్నారు.

వంద రోజుల ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

- పది పరీక్షల్లో మరోసారి ప్రథమ స్థానం సాధించేలా చర్యలు
- 'ప్రజాశక్తి'తో మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

రానున్న ఏడాదిలోనూ పదో తరగతి పరీక్షల్లో పార్వతీపురం మన్యం.. రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచేలా చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు చెప్పారు. అందులో భాగంగా జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామని వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

వరుసగా మూడేళ్లుగా పదో తరగతి పరీక్షల్లో మన్యం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈసారి ఆ స్థానం నిలబెడతారా.?

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తరువాత వరుసగా మూడేళ్లుగా పదోతరగతి పరీక్షల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. నాలుగో ఏడాదిలో కూడా అదే స్థానంలో జిల్లా నిలిచేలా చర్యలు చేపడుతున్నాం.

మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు వంద రోజుల ప్రణాళికతో ముందుకు వెళు తున్నాం. విద్యార్థులకు ప్రతిరోజూ ఒక సబ్జెక్టుపై పరీక్ష నిర్వహించి ఆ మార్కులను లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ఈ విధంగా చేయడం వల్ల విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయడానికి వీలవుతుంది. రాష్ట్ర స్థాయిలో ఏ జిల్లా ముందంజలో ఉందనే అంచనా ప్రభుత్వానికి ఏర్పడుతుంది.

మొదటి స్థానంలో నిలిపేందుకు ఇంకెలాంటి చర్యలు చేపడుతున్నారు.?

జిల్లాలో ఉన్న 147 ఉన్నత పాఠశాలలకు పదో తరగతి పరీక్షలకు సంబంధించిన మెరుగైన ఫలితాలు సాధించేందుకు వందరోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ఈ ప్రణాళిక అమలు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాం. మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను ఒక్కో పాఠశాలకు నియమించాం. పది పరీక్షలు ప్రారంభమ య్యే వరకు ఈ అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుంది.

జిల్లాలో ఎంత మంది పది పరీక్షలకు హాజరుకానున్నారు.?

జిల్లాలో 68 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. 10,685 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కానున్నారు.

డిఇఒగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మీరు ఎలా సవాళ్లను ఎదుర్కొంటారు.?

జిల్లాలో ఉన్న భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉంది. గతంలో రెగ్యులర్ డిఇఒగా ఆరు నెలలు పనిచేసిన అనుభవం ఉంది. అంతకుముందు ఐటిడిఎలోనూ పనిచేశాను.

జిల్లాలోని పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం అమలు ఎలా ఉంది.?

జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం అమలవుతోంది. మధ్యాహ్న భోజన సమయంలో విధిగా సబ్బుతో చేతులు కడుక్కొనేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థుల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుంది.

కేంద్ర నిధులపై రాష్ట్ర పెత్తనం ఏమిటి ? : ఎంపిపి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పెత్తనం ఏమిటని లోకల్ గవర్నమెంట్ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు, విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 3,82, 065/2025ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ఈ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. దీని ప్రకారం ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే పంచాయతీలు, మండల పరిషత్‌లు ప్రాధాన్యత పనులు గుర్తించి కార్యచరణ రూపొందించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులు ఇప్పటికే కొన్ని పూర్తికాగా మరికొన్ని మధ్యలోనే ఉన్నాయని తెలిపారు. ఈ పనులు పూర్తి చేయడానికి ఈ నిధులు ఎంతో అవసరమని తెలిపారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వాసవి ఆర్యవైశ్య సొసైటీ భవనంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. డిప్యూటీమేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభించిన ఈ పోటీల్లో సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించి పతకాలు సాధించాలని కోరారు. జిల్లాలో తైక్వాండో క్రీడకు మంచి ప్రాచుర్యం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకరి సతీష్, ఆర్యవైశ్య చౌల్ట్రీ సంఘ సభ్యులు ఎ.. శ్రీనివాసరావు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా కోరాడ మనిరాజు, రామకృష్ణ, షర్మిల, ఉదయ్ కుమారులు వ్యవహరించారు. ఈ టోర్నమెంట్ లో ప్రథమ బహుమతి పొందిన విజేతలంతా జనవరి 3 4 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే 39వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు పాల్గొంటారు.

పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

అంబరాన్నంటిన కందికొత్తల సంబరం

- ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు సాక్ష్యం : కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి
- ఆదివాసీలతో కలిసి అడుగులేసిన జిల్లా మెజిస్ట్రేట్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే కందికొత్తల సంబరం అంబరాన్నంటింది. సంప్రదాయం, ప్రకృతి, సంస్కృతి మేళవింపుగా ఉత్సవం సాగింది. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఆదివారం వైభవంగా ఈ పండగ జరిగింది. కందికొత్తల వేడుకలో కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి పాల్గొని, గిరిజనులలో ఉత్సాహాన్ని నింపారు. ప్రకృతిని దైవంగా భావించి, తాము పండించిన మొదటి పంటను ప్రకృతికి అర్పించే గొప్ప సంప్రదాయానికి పార్వతీపురం మన్యం జిల్లా వేదికని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గిరిజనుల జీవన విధానం ప్రకృతితో ఎంతగా ముడిపడి ఉందో ఆయన వివరించారు. వన దేవతకు కలెక్టర్ పూజలు చేశారు. అనంతరం గిరిజన మహిళలు, పురుషులతో కలిసి కలెక్టర్ కాసేపు సంప్రదాయ నృత్యాల్లో పాలుపంచుకోవడం విశేషం.

గిరిజన వేషధారణలతో అలరిస్తున్న చిన్నారులు

తుడుము మోగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

సంక్రాంతి పండగకు ముందుగా వచ్చే ఈ వేడుకలో గిరిజనులు సమూహంగా చేరి సంప్రదాయ ఆచారాలను పాటించారు. తాము సాగు చేసిన పంట చేతికి వచ్చే తరుణంలో, భూమికి, ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు, వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గిరిజన సంస్కృతిలో దాగి ఉన్న విలువలను నేటి తరానికి అందించడమే లక్ష్యంగా ఈ పండుగను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. మహిళలు, యువత, ఉద్యోగులు, రాజకీయ, గిరిజన నాయకులు జట్టుకట్టు నృత్యం, థింసా, మేళతాళాలతో చిన్న, పెద్ద, ఆడ, మగ అనే తారతమ్యం లేకుండా కందికొత్తల ఉత్సవాలలో సందడి చేశారు.

కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిడ్డిక పద్మావతి, ఎస్‌టి కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, ఎంపిడిఒ ఐవి లక్ష్మి, తహశీల్దార్ ఎన్.శేఖర్, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎంఇఒ చంద్రశేఖర్, ఎల్విన్‌పేట సిఐ హరి, ఎస్‌ఐ బిడ్డిక శివప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు తోయక నాగభూషణం, పత్తిక శంకర్రావు, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు, ట్రైబల్ రైట్ ఫోరం అధ్యక్షులు లోవరాజు, గిరిజన నాయకులు నిమ్మక సింహాచలం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.